క్లుప్తంగా

బిల్లబంద ఆక్రమణపై చర్యలు చేపట్టాలి



ఆర్డీఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బిల్లబంద, గోర్జిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆర్డీఓ కె. హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ అనుమతులు లేకుండా వేసిన అనధికార లే అవుట్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి ఆర్డీఓ వెంటనే స్పందించి సంబంధిత డిపార్ట్‌మెంట్ల వారికి ఫోన్ చేసి సమగ్రమైన విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపట్ల పాఠశాల విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది, అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగిపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం, కేజీబీవీ, స్కూల్‌ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య సిబ్బందితోకలిసి సీజనల్ వ్యాధులు– వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన సదస్సు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మ, సిబ్బంది చంద్రినాయుడు,విద్యాలయాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథుడు



కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

సాలూరు: పట్టణంలోని కొలువైన జగన్నాథ స్వామి కల్కి అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. గుండిచా మందిరం వద్ద ఉన్న స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల జగన్నాథ నామస్మరణ మధ్య సాయంత్రం స్వామి వారిని రథం మీదకు చేర్చారు. వేలాది సంఖ్యలో భక్తుల రాకతో ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పట్టణ సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. 9 రోజుల పాటు గుండిచా మందిరం వద్ద పూజలు అందుకున్న జగన్నాథ స్వామి సోదర, సోదరీమణులు సుభద్ర, బలభద్ర సమేతంగా తన ఆలయానికి చేరుకోవడంతో మారు రథయాత్ర ముగిసింది.

తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై తల్లిదండ్రులు లేదా సంరక్షకులు శ్రద్ధ వహించాలని ఎంఈఓ -2 కురిటి సోంబాబు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న సేవలు, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు బి. శ్రీకాంత్, ఐఈఆర్‌టీ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: రెండో విడత దోమల నివారణా మందు స్ప్రేయింగ్ కార్యక్రమం పలు గ్రామాల్లో సోమవారం ప్రారంభమైనట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కోసంగి, వంబరెల్లి, సంకిలిగూడ, బుద్దుడుగూడలలో ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎన్‌ఎంలు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఆర్‌ఐ లక్ష్మున్నాయుడు

వీరఘట్టం: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు వినతులు వచ్చినట్లు ఆర్ఐ లక్ష్మున్నాయుడు తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై వినతులు వచ్చాయని, ప్రాధాన్యతాక్రమంలో వీటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు రఘునాయుడు, సురేష్‌కుమార్, నగేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిపై గంపెడాశలు



- ఎదురుచూస్తున్న అర్హులు

పార్వతీపురంటౌన్: ఉద్యోగాలు, ఉపాధి కోసం అర్హులైన యువత ఎదురు చూస్తోంది. జాబ్ క్యాలెండర్‌పై గంపెడాశలు పెట్టుకుంది. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి' ఇవ్వాలని కోరుతోంది. అధికారంలోకి వచ్చి నెల దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడడం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన 37,789 కుటుంబాల్లోని యువత డిమాండ్ చేస్తోంది. 2014లో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారు. అప్పట్లో చంద్రబాబు విసిరిన మాయ వలలో చిక్కుకుని ఐదేళ్లూ నిరుద్యోగ యువత విలవిల్లాడిపోయారు. మరోసారి అలాంటి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది.

మళ్లీ మోసం చేస్తారా?

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేపట్టే వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రధాన హామీగా పదే పదే ప్రచారం చేసుకుంది. అయితే అధికారంలోకి రావడం, పాలన ప్రారంభించడంతో పాటు నిత్యం ముఖ్యమంత్రి, మంత్రులు శాఖల వారీగా సమీక్షలు మొదలెట్టారు. కానీ, నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతిపై ఒక్క మాట కూడా మాట్లాడట్లేదు. నిరుద్యోగ భృతి అమలుపై కనీసం విధి విధానాలు, మార్గదర్శకాల జారీపై కసరత్తు కూడా ప్రారంభించలేదు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014–19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఐదేళ్లు పబ్బం గడుపుకుని మొండి చేయి చూపించారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం చేస్తారా అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సాయంగా భృతి ఇస్తే నిరుద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లవుతుంది. ఈసారి అమలు చేయబోయే నిరుద్యోగ భృతి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇవ్వాల్సిందే.
– బండి సాగర్, నిరుద్యోగి, పార్వతీపురం పట్టణం

నిరుద్యోగుల ప్రస్తావనే లేదు



ప్రభుత్వం ఏర్పడి నెల గడుస్తున్నా నిరుద్యోగుల ప్రస్తావన లేదు. నిరుద్యోగ భృతి హామీ ఇచ్చారు కానీ అమలుపై ఆసక్తి చూపడం లేదు. అసలు నిరుద్యోగ భృతి అమలు చేసే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఉందా? లేకుంటే ఎప్పటిలాగానే యూటర్న్ తీసుకుంటారా? నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారా? అని అనుమానంగా ఉంది.
–ఉర్లాపు వేణు, నిరుద్యోగి, శివిని గ్రామం

స్పష్టత ఇవ్వడం లేదు



నిరుద్యోగ భృతిపై నూతన ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. గతంలో మాదిరిగా కాకుండా తక్షణమే నిరుద్యోగ భృతి నివ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వయస్సుతో సంబంధం లేకుండా అర్హులందరికీ వర్తింపజేయాలి. లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని యువగళంలో లోకేష్ హామీ నిచ్చారు. నిరుద్యోగ భృతిపై ప్రస్తావన లేదు. ఉద్యోగాలు ఇస్తారన్న నమ్మకం లేదు.– బొత్స ప్రసాద్, నిరుద్యోగి, పార్వతీపురం పట్టణం

యవతంతా ఎదురు చూస్తున్నాం..



నిరుద్యోగ భృతి కోసం యవత అంతా ఎదురు చూస్తున్నాం. గతంలో మాదిరి మోసం చేయకుండా తక్షణమే అమలు చేయాలి. ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఈ సారి మోసం చేసి మాతో ఆడుకోవద్దు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారో తేదీ ప్రకటించాలి.
–రవీంద్ర, నిరుద్యోగి, పార్వతీపురం పట్టణం

స్కూల్ స్వీపర్ల ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్వీపర్లు

సీతానగరం: మండలంలోని వివిధ పాఠశాలల్లో దీర్ఘకాలంగా పని చేస్తున్న స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వి. వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండలంలోని అన్ని స్కూల్స్‌లో పనిచేస్తున్న స్వీపర్ల (సీఐటీయూ అనుబంధ) సంఘం నాయకులు వెంకటరమణ, శాంతి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా స్వీపర్లు మాట్లాడుతూ పాఠశాలల్లో దీర్ఘకాలం నుంచి మరుగుడ్ల శుద్ధి పనుల్లో విధులు నిర్వహిస్తున్నామని అయినా వేతనాలు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అలాగే ప్రతినెలా సబ్బులు, గ్లౌజులు, కొబ్బరి నూనె సరఫరా చేయాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కొన్ని స్కూల్స్‌లో ప్రభుత్వమే చీపుళ్లు కొనాల్సి ఉన్నా తమ సొమ్ముతోనే కొనుగోలు చేస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్కూల్ స్వీపర్ల సంఘం మండల నాయకులు ఉష, గౌరమ్మ, తిలోత్తమ, సత్యవతి పాల్గొన్నారు.

పిల్లల ప్రారంభ అభివృద్ధిపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ పిల్లల ప్రారంభ అభివృద్ధిపై అవగాహన కల్పించుకుని గ్రామాల్లో పిల్లల తల్లులకు తెలియజేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. పిల్లల ప్రారంభ అభివృద్ధి కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యం, అభివృద్ధిని ఎప్పటికప్పుడు అంగన్వాడీ సిబ్బంది పరిశీలించాలని సూచించారు. అలాగే గ్రామాల్లోని పిల్లలు పాఠశాలకు వచ్చేవరకూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అలాగే పిల్లల ఆరోగ్యం పట్ల వైద్యారోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లల్లో ఆరోగ్యం, విద్య, విజ్ఞానం కోసం అందరూ సమష్టిగా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ, హెల్త్ సూపర్‌వైజర్లు భవానీ, సత్యవతి,వెల్‌నెస్ కేంద్రాల నిర్వాహకులు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ మెస్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలి



సాంఘిక సంక్షేమ వసతి గృహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్ / పార్వతీపురం: పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రం పార్వతీపురంలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గ్రహాల్లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఏడు సంవత్సరాల నుంచి ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేకమార్లు జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ కనీసం ఆ భవనాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని మండిపడ్డారు.

తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించకుంటే జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం ముట్టడికి పిలుపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరిపల్లిలో తాగునీటి ఇబ్బందులు



మరమ్మతులకు గురైన రక్షితమంచినీటి పథకం

సాలూరు: మండలంలోని మరిపల్లి గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రక్షితమంచినీటి పథకం మూడురోజుల క్రితం మరమ్మతులకు గురైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో చేతి బోర్లు లేకపోవడంతో తాగునీటికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. దీంతో తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 450 ఇళ్లు, 2 వేల మంది జనాభా ఉన్న గ్రామం కావడంతో తాగునీటి ఎద్దడి అధికమైంది. కొందరి ఇళ్ల వద్ద ఉన్న మోటార్ల వద్దకు వెళ్లి పలువురు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. స్థానిక రామమందిరం వద్ద ఉన్న మోటారు వద్దకు సోమవారం అధిక సంఖ్యలో గ్రామస్తులు బారులు తీరి నీటిని పట్టుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుమలతను వివరణ కోరగా, రక్షిత మంచినీటి పథకం మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే నీటిని అందిస్తామని తెలిపారు.

విత్తనాలు నాణ్యమైనవే..

వీరఘట్టం : మండల కేంద్రంలోని జనతా రైతు డిపోలో విక్రయిస్తున్న విత్తనాలు నాణ్యమైనవని ఏఓ సౌజన్య స్పష్టం చేశారు. డిపో సిబ్బంది తనకు నాసిరకం మొక్కజొన్న విత్తనాలు విక్రయించారని ఆరోపిస్తూ ఓ రైతు డిపో ముందు ఆందోళనకు దిగిన వైనంపై సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందిస్తూ, డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిపో సిబ్బంది 160 కిలోల మొక్కజొన్న విత్తనాలు (164 రకం) తీసుకురాగా.. వీరఘట్టంలోని 20 మంది రైతులకు 150 కిలోలు, పెద్దబుడ్డిడి గ్రామానికి చెందిన రైతులకు ఏడు కిలోలు విక్రయించారని చెప్పారు.

అంగన్వాడీ నాయకురాలిపై విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఎంఎన్‌రాణి

సాలూరు: అంగన్వాడీ యూనియన్ నాయకురాలు, అంగన్వాడీ కార్యకర్త బలగ రాధపై కొందరు కార్యకర్తలు చేసిన ఆరోపణలపై ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి విచారణ చేపట్టారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని వైటీసీలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశమై విచారణ చేశారు. అంతకుముందు విలేకరులతో ఆమె మాట్లాడారు. నాయకురాలు రాధ కార్యకర్తల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నరని, వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని కొందరు కార్యకర్తలు ఆరోపించినట్లు చెప్పారు. ఈ మేరకు విచారణ చేపట్టామని, కార్యకర్తలు చేసిన ఆరోపణలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను అందచేసి అంగన్వాడీల నుంచి జవాబు రాబట్టే ప్రయత్నం చేశామన్నారు.ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆమె స్ఫూర్తి మహిళా సంఘం అనే స్వచ్ఛంద సంస్థ నడుపుతూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు కార్యకర్తలు ఐసీడీఎస్ పీడీ దృష్టికి తీసుకువెళ్లగా అది నిబంధనలకు విరుద్ధమైతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో పట్టణ సీడీపీఓ సత్యవతి ఉన్నారు. కాగా రాధ అక్రమ వసూళ్లు, వడ్డీ వ్యాపారాలు చేస్తూ, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని, ఇటీవల కొందరు అంగన్వాడీ కార్యకర్తలు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. అలాగే కొందరు అంగన్వాడీ కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ఆమె కూడా కొందరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా ముగిసిన రథోత్సవం



గుండిచా మందిరం వద్ద స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఎస్.పెద్దవలసలో జగన్నాథస్వామిని దర్శించుకున్న రంగునాయుడు

బలిజిపేట: జగన్నాథస్వామి రథోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గుండిచా మందిరం వద్ద తొమ్మిదవ రోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త బి.శ్రీధర్, ప్రధాన అర్చకుడు హరిల ఆధ్వర్యంలో నవరాత్రులు ఘనంగా ముగించారు. చివరిరోజు సోమవారం తెల్లవారు జాము నుంచి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గుడి ప్రాంగణంలో యాత్ర నిర్వహించారు. గుండిచా మందిరం వద్ద స్వామివారిని ఆరు రోజుల పాటు మత్స్య, కూర్మ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కల్కి, బుద్ధ అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని గుండిచా మందిరం నుంచి తిరిగి వేంకటేశ్వర ఆలయం వద్దకు తీసుకువస్తారు. యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ బందోబస్తు నిర్వహించింది.

మక్కువలో....

మక్కువ: మండలకేంద్రం మక్కువ, ఎస్.పెద్దవలస గ్రామాలలో జగన్నాథ స్వామి మారు రథయాత్ర సోమవారం వైభవంగా జరిపించారు. మక్కువలోని అన్ని ప్రధానవీధుల్లో రథయాత్ర నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు మక్కువ చేరుకుని స్వామివారికి పూజలు చేశారు. అలాగే ఎస్.పెద్దవలస గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్వతీపురంలో...



పార్వతీపురంలో జగన్నాథస్వామి రథయాత్ర

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో జగన్నాథ స్వామి మారు రథయాత్రను సోమవారం వైభవంగా నిర్వహించారు. దేవాదాయశాఖ అధ్వర్యంలో నిర్వహించిన యాత్రలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర పాల్గొన్నారు. జగన్నాథస్వామి, సుభద్రా దేవి, బలరాముల విగ్రహాలను రథంలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని గుండిచా మందిరం నుంచి జగన్నాథ స్వామి ఆలయానికి యాత్రగా తీసుకువెళ్లారు.

బాధ్యతాయుతంగా ఉండాలి

- న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్



రోడ్డు ప్రమాదాల నియంత్రణ, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

పాలకొండ రూరల్: రోడ్లపై వాహనాలు నడిపే వాహన చోదకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఎ. విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలో రహదారి ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన నిబంధనలపై ప్రజలకు అవగాహన సదసస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు అధిగమించవచ్చన్నారు. మితిమీరిన వేగం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారికి కఠినమైన శిక్షలు పడతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

అంధకారంలో కరడవలస



అంధకారంలో గ్రామం



కరెంటు లేక తాగునీటికోసం ఖాళీ బిందెలతో మహిళలు

- నెలరోజులుగా కరెంటు కష్టాలు
- పట్టించుకోని అధికారులు

సాలూరు రూరల్: మండలంలోని కరడవలస గ్రామం మూడురోజులుగా అంధకారంలో మగ్గుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కరెంటు లేక రాత్రిపూట ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు తెలియపరిచినా పట్టించుకున్న పాపాన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో చిన్నపిల్లలతో ఉన్నామని దోమల బెడదతో అల్లాడుతున్నామని ఎప్పుడు అధికారులు వచ్చి కరెంటు బాగు చేస్తారోనని ఎదురుచూస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కరెంటు లేక బోర్లు పనిచేయకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కష్టాలను కూడా ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ మహిళలు బిందెలతో వెళ్లి ఊరి చివర ఉన్న నూతిలో నీరు తోడుకుని తీసుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు. విద్యుత్ శాఖాధికారులు వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.